క్లుప్తంగా

బుచ్చిరెడ్డిపాళెం సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ హైమారావు

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.హైమారావు మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ రామారావు గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో హైమారావు బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతిభద్రతలు, నేరాల నియంత్రణకు కృషి చేస్తానని నూతన సీఐ తెలిపారు.

ట్రై సైకిల్ అందజేత



ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన దివ్యాంగుడు మాణికల మారయ్య అనే వ్యక్తికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ఆదివారం ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ ట్రస్ట్ ద్వారా సైకిల్‌ను సమకూర్చినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, మారుబోయిన సంతోష్‌గౌడ్, సర్పంచ్ నిరంజన్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో వనమా శేషయ్య, పద్మావతమ్మ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దాదాపు 200 మంది పేదలకు ట్రస్ట్ నిర్వాహకులు దొరడ్ల సత్యనారాయణ, లలితమ్మ దంపతుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తొలుత అన్నదానం జరిగింది. ట్రస్ట్ సభ్యులు శ్రీధర్, వెంకట సుప్రజ, ఉదయ్‌కిరణ్, కాంచనలక్ష్మి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



విడవలూరు : తుపాన్ ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న గిరిజన కుటుంబాలకు మండలంలోని ఊటుకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. దాదాపు 580 కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన బియ్యం, కందిపప్పు, నూనె, ఎర్రగడ్డలు, ఉల్లగడ్డలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ విజయభానురెడ్డి, వీఆర్వో భాస్కర్ పాల్గొన్నారు.

నేడు అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ

వెంకటాచలం : అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు మండలంలోని ఎర్రగుంట వద్ద ఉన్న కమ్యూనిటీ హాలులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం పట్టాలు పంపిణీ చేస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరుగనున్న కార్యక్రమానికి రైతులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

కసుమూరులో మహిళపై లైంగికదాడి?

వెంకటాచలం : మండలంలోని కసుమూరులో ఓ అద్దె గృహంలో సుమారు 50 ఏళ్ల మహిళపై గ్రామానికి చెందిన వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన వీడియో వైరల్‌గా మారింది. అద్దె గృహంలో మహిళపై వ్యక్తి అత్యాచారానికి పాల్పడుతున్న సమయంలో కొందరు యువకులు వీడియోలు తీయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయం పోలీసుల దృష్టికి రావడంతో విచారణ చేపడుతున్నారు.

వేదగిరిలో విశేష పూజలు

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలు, ప్రత్యేకాభిషేకాలను ఆదివారం నిర్వహించారు. స్వామి, అమ్మవారికి తిరుప్పావై సేవను జరిపారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు.

నిమ్మ రైతును ఆదుకునేలా..

వందల సంఖ్యలో ధ్వంసమైన తోటలు

- నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు
- రైతులకు ప్రభుత్వ భరోసా


విరిగిపడిన ముదురు చెట్లు

మెట్టప్రాంత ఉద్యాన పంటల్లో అగ్రస్థానంలో ఉన్న నిమ్మ రైతులు మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోయారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతిరైతును ఆదుకునేలా అధికారులు వేగంగా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. కాగా పంట నష్టం ప్రాథమిక అంచనాలు పూర్తి చేయగా, అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన నేటి నుంచి జరుగనుంది.

పొదలకూరు : ఈ ఏడాది పొదలకూరు పరిసర ప్రాంతాల్లో రైతులు విస్తారంగా నిమ్మతోటల సాగు చేపట్టారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మనుబోలు, వెంకటాచలం మండలాల్లో సైతం నిమ్మసాగు ఉంది. పెనుగాలుల వల్ల తోటల్లోని నిమ్మచెట్లు నేలకొరిగాయి. పొదలకూరు పరిసర ప్రాంతాల్లో నిమ్మసాగును జీవనాధారం చేసుకుని సుమారు 2 వేల మందికి పైగా రైతులు జీవిస్తున్నారు. వీరికి ఇతర పంటల సాగు కూడా తెలియదు. కష్టమైనా, నష్టమైనా నిమ్మసాగునే నమ్ముకుని జీవిస్తున్నారు. ఈ ప్రాంతంలో 3 వేల హెక్టార్లకు పైగా నిమ్మతోటల సాగు ఉంది. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం తుపాను వల్ల పెనుగాలులకు 1,638 మంది రైతులు 728 హెక్టార్లలో తోటలను నష్టపోయినట్లు నివేదించారు. సుమారు రూ.7 కోట్లకు పైగా రైతులకు నష్టం వాటిల్లి ఉంటుందని లెక్కలు కట్టారు. అయితే అధికారుల నియమ, నిబంధనల ప్రకారం ప్రాథమిక అంచనా ఇలా ఉన్నా అంతకంటే అదనంగా రైతులకు నష్టం వాటిల్లి ఉంటుందని తెలుస్తోంది. నిమ్మసాగు చేస్తున్న ప్రతి రైతు దాదాపుగా నష్టపోయారని వెల్లడిస్తున్నారు. ప్రతితోటలో చెట్లు వేర్లతో సహా పెకిలించుకున్నాయి. దీంతో రైతులు చెట్లను అతికష్టం మీద నిలబెట్టి మట్టి కూరినా తిరిగి బతికే అవకాశం లేదంటున్నారు. పొదలకూరు నిమ్మమార్కెట్‌కు కాయలు కూడా చాలా తక్కువగా వస్తున్నాయి. అధికారులు అంచనాలు రూపొందించడంలో ఉదారంగా వ్యవహరించి రైతులను ఆదుకోవాల్సిందిగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక



పంట నష్టంపై సోమవారం నుంచి క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక సమర్పించాల్సిందిగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. నష్టానికి గురైన ప్రతిరైతు తోటను పరిశీలించి నివేదిక అందజేస్తాం. ఇప్పటికే తమ సిబ్బంది ప్రాథమిక నివేదికలు రూపొందించారు.

– ఈ.ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

వేర్లతో సహా నేలకొరిగిన నిమ్మచెట్లు


పెద్ద ఎత్తున నష్టం



నిమ్మరైతులకు కనీవినీ ఎరుగని రీతిలో తుపాను వల్ల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందనే నమ్మకం ఉంది. వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తోటలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. రైతులు తిరిగి కోలుకునేందుకు సమయం పడుతుంది.

– జి.గోపాలయ్య, రైతు, మర్రిపల్లి

ఎన్నడూ లేనివిధంగా నష్టం



మునుపెన్నడూ లేని విధంగా నిమ్మకు నష్టం వాటిల్లింది. తుపాన్లు వచ్చినా ఇంత పెద్ద ఎత్తున రైతులు నష్టపోయింది లేదు. ఈదురు గాలులకు చెట్లు తిరగబడి పోవడంతో చెట్లకు ఉన్న కాయలు రాలిపోయి తీవ్రంగా నష్టపోయాం.

– జి.రామయ్య, రైతు, చెర్లోపల్లి

శివపార్వతుల కల్యాణం రేపు

కొడవలూరు : కార్తీక అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని గండవరంలో ఉన్న గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణోత్సవం, మహారుద్రాభిషేకం, లక్ష దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు బి.సుబ్రహ్మణ్యం, ఎస్.హరిప్రసాద్ ఆదివారం తెలిపారు. దశ మహావిద్యాశ్రీ భువనేశ్వరి మఠం బృందంచే మహారుద్రాభిషేకం జరుగుతుందన్నారు.

ఆక్వా నష్టంపై సర్కారు దృష్టి


పొట్టెంపాడులో రొయ్యల చెరువును ముంచిన వరద

ముత్తుకూరు : మిచాంగ్ తుపాను దెబ్బకు ఆక్వా రంగం కూడా అల్లాడిపోయింది. వరదలు రొయ్యల చెరువులను ముంచెత్తాయి. కట్టలు తెగిపోయి విలువైన రొయ్యలు ఏటిపాలయ్యాయి. ఈ నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా పొట్టెంపాడు, పోలంరాజుగుంట, కృష్ణపట్నం, పైనాపురం, పంటపాళెం ప్రాంతాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. భారీ వర్షాల వల్ల పొట్టెంపాడు, పోలంరాజుగుంట ప్రాంతాల్లో సుమారు 60 ఎకరాల మేర రొయ్యల చెరువులకు నష్టం వాటిల్లింది. కట్టలు తెగిపోయి, గుంతలు మునిగిపోయి రొయ్యలు ఏటి పాలయ్యాయి. దాదాపు రూ.కోటికి పైగా నష్టం వాటిల్లింది. రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇప్పటికే తోటపల్లిగూడూరు మండలంలో దెబ్బతిన్న రొయ్యల చెరువులను పరిశీలించారు. రొయ్యల రైతులకు భరోసా ఇచ్చారు.

దేవుని దయ..సీఎం ప్రోత్సాహంతో మంత్రినయ్యా

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం, దేవుడి దయతో మంత్రిని అయ్యానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పొదలకూరులోని దువ్వూరు నారాయణరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1978–79 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నెల్లూరు నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ 2014, 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీఫారమ్ ఇవ్వడంతో ఎమ్మెల్యేగా గెలిచానని, ఆ తరువాత మంత్రి పదవి కూడా ఇచ్చి నాలుగు శాఖలను కేటాయించారని పేర్కొన్నారు. ఆయా శాఖలలో తనతో పాటు 18 మంది ఐఏఎస్ అధికారులు పనిచేస్తున్నారని చెప్పారు. తాను ఐఏఎస్ చేయాలని తండ్రి కోరుకున్నారని, అయితే తనకు చదువంటే ఇష్టం లేక మానుకోవాలనుకున్నానని, పెద్దలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదో తరగతి ప్రథమశ్రేణిలో పాసయ్యానని తెలిపారు. ఆ రోజుల్లో ఫస్ట్ క్లాస్ వచ్చినా వీఆర్ కళాశాలలో సీటు రావడం చాలా కష్టమైందని, వెయిటింగ్ లిస్టులో సీట్ తెచ్చుకుని ఇంటర్మీడియట్ చదివానని గుర్తుచేసుకున్నారు. ఒక సంవత్సరం వృథా అయిందన్నారు. ఆ సమయంలో చదువు మానడం తప్పిదమని గ్రహించి కర్ణాటకలో ఇంజినీరింగ్ పూర్తి చేశానని తెలిపారు. ఆ తరువాత వ్యాపార రంగంలోకి ప్రవేశించానని అక్కడ పట్టిందల్లా బంగారం అయిందన్నారు. తన తండ్రి 18 ఏళ్ల సమితి ప్రెసిడెంట్‌గా పనిచేశారని, తనకు జిల్లా పరిషత్ చైర్మన్‌గా అవకాశం కలిగిందని చెప్పారు. 2014, 2019లలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో ఎమ్మెల్యే అయ్యానని, ఆయన దయతో మంత్రిని అయ్యానని పేర్కొన్నారు.

చిన్ననాటి మిత్రులను కలవడం సంతోషంగా ఉంది

తనతో పాటు పదో తరగతి చదువుకున్న మిత్రులను 44 ఏళ్ల తరువాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని మంత్రి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అందర్ని చూస్తుంటే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయన్నారు. కొంతమంది తరుచూ, మరికొంతమంది అప్పుడప్పుడు తనను కలుస్తూనే ఉన్నారని, అందరిని ఒకేసారి కలుసుకోవడం మరుపురాని విషయమన్నారు. ఏటా కానీ, కనీసం రెండేళ్లకు ఒకసారి అయినా పూర్వ విద్యార్థులందరం కలుసుకోవాలన్నారు. బాధైనా సంతోషమైన భగవంతుడు తరువాత చెప్పుకునేది స్నేహితుడితోనేని అన్నారు. తమకు చదువు చెప్పి ఈ స్థితికి రావడానికి కారణమైన ఉపాధ్యాయులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడ్ని కోరుకుంటున్నామన్నారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి

మంత్రి బ్యాచ్ మెట్లు, గురువులు మాట్లాడుతూ గోవర్ధన్‌రెడ్డి తన తండ్రిని మించిన తనయుడు అయ్యారని, తమ మిత్రుడు మంత్రిగా కీలక పదవిలో ఉండడం సంతోషంగా ఉందని, జీవితంలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. తన బ్యాచ్‌మేట్లు, గురువులను మంత్రి శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం మంత్రి కాకాణిని బ్యాచ్‌మెట్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువులు సుబ్బరామిరెడ్డి, జోసెఫ్, బ్యాచ్‌మెట్లు కామేష్, సూరి, రాంప్రసాద్, సుజనమ్మ పాల్గొన్నారు.

పేదలకు ఆపన్న హస్తం


అసైన్‌మెంట్ పట్టాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడుకు చెందిన 14 మంది రైతులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం అసైన్‌మెంట్ పట్టాలు పంపిణీ చేశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. అలాగే ప్రపంచస్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన మైపాడు తూర్పుపాళేనికి చెందిన దివ్యాంగుడు కటారి యాదగిరికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. దీంతో పాటు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు తల్లిదండ్రులను కోల్పోయిన మైపాడు తూర్పుపాళేనికి చెందిన పాముల ప్రతాప్‌కు ట్రస్టు ద్వారా రూ.20 వేలను బ్యాంక్‌లో డిపాజిట్ చేయించి బాండ్‌ను కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, మత్స్యకార నేతలు పామంజి నరసింహ, శ్రీహరికోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలి


పార్వతీ పరమేశ్వరుని కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే అనిల్

ఇందుకూరుపేట : పవిత్ర కార్తీక మాసంలో పార్వతీ పరమేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో విశ్వబ్రాహ్మణ కార్తీక వనభోజన మహోత్సవం ఆదివారం జరిగింది. ముందుగా పార్వతీ పరమేశ్వరుని కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ గాంధీ నడయాడిన ప్రాంతంలో పార్వతీ పరమేశ్వరుని కల్యాణోత్సవం నిర్వహించడం సంతోషకరమన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నేత గానాల రామ్మూర్తి విగ్రహ ఏర్పాటుకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తొలుత ఆశ్రమ ఆవరణలోని గాంధీ, స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి శానంపూడి సుబ్బనాచారి, సుజాత కార్యనిర్వాహకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, గంపల మంజుల, ఆశ్రమ మేనేజర్ మనోజ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



కోవూరు : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికవగా, వారిని ఆదివారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నరసింహమూర్తి మాట్లాడుతూ విజయనగరం జిల్లా రాజీవ్ స్టేడియంలో ఈనెల 11, 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని వివరించారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు


పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని పైకి లేపుతున్న సిబ్బంది


వెంకన్నపాళెం పొలాల్లో విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

- విద్యుత్ శాఖకు భారీ నష్టం
- అన్నిగ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ

మనుబోలు : మిచాంగ్ తుపాన్ మండలంలో విద్యుత్ శాఖకు భారీ నష్టాన్ని కలిగించింది. ఊహించని విధంగా ఈదురు గాలులు వీచడంతో భారీ సంఖ్యలో విద్యుత్ స్తంభాలు పడిపోవడమో, విరిగిపోవడమో జరిగింది. రూ.కోటికి పైగా నష్టం వాటిల్లినట్లు ఆ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. 200 లకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే 5 కిలోమీటర్ల కండక్టర్ వైరు, 4 కిలోమీటర్ల కేబుల్ వైరు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా వెంకన్నపాళెం సబ్‌స్టేషన్ వద్ద తీవ్రంగా నష్టం వాటిల్లింది. ప్రతి పనికి విద్యుత్ ఎంతో కీలకం కావడంతో మండలంలో 3 రోజుల పాటు అన్ని పనులు స్తంభించిపోయాయి. ట్రాన్స్‌కో ఏడీ రవికుమార్‌రెడ్డి, ఏఈ నాగార్జున ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. రాత్రింబవళ్లు విద్యుత్ శాఖ సిబ్బంది పనులు చేసి చాలావరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు పూర్తి చేశారు.


దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్


వరద నీటిలో వెంకన్నపాళెం సబ్‌స్టేషన్ (ఫైల్)

వేగంగా పనులు

విద్యుత్ శాఖకు గతంలో ఎన్నడూ లేని విధంగా నష్టం వాటిల్లినప్పటికీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేయగలిగాం. ఇక్కడ సిబ్బంది తక్కువగా ఉండడంతో కర్నూలు నుంచి 20 మందిని పిలిపించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నాం. ఇళ్లకు దాదాపుగా 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాం. ఇక వ్యవసాయ పొలాల్లో పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేస్తున్నాం. ఇప్పటికీ వరదనీరు పూర్తిగా తొలగిపోకపోవడంతో పనులు ఆలస్యం అవుతున్నాయి.

– ఏడీ రవికుమార్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే వికసిత్ భారత్ లక్ష్యం


ఆయుష్మాన్ కార్డులు అందజేస్తున్న అధికారులు

మనుబోలు : ప్రజా సంక్షేమమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వివిధ వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అందులో ఆయుష్మాన్‌భవ కార్యక్రమం ఒకటని గుర్తుచేశారు. అలాగే రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇంకా ఎన్నో వినూత్న పథకాలను కేంద్రం అమలు చేస్తోందని, వాటిపై ప్రజలను చైతన్యవంతులు చేయాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు ఆయుష్మాన్‌భవ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, హౌసింగ్ ఏఈ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రేష్మసోని తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న కోవూరు సీఐ వెంకటేశ్వరరావు

కోవూరు : పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోవూరు సీఐ డి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కోవూరు సర్కిల్ కార్యాలయంలో కోవూరు, ఇందుకూరుపేట మండలాల ఎస్సైలతో ఆదివారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాత్రి వేళల్లో గస్తీలు పెంచి ఎక్కడా చోరీలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సకాలంలో పరిష్కరించేలా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ హేమలత, ఎస్సైలు రంగనాథ్‌గౌడ్, వీరేంద్రబాబు ఉన్నారు.